తలుపు కొట్టి.. భుజం తట్టి

ప్రజల బాగోగులు తెలుసుకుని చేసేదే ప్రజారంజక పాలన. అట్టడుగు వర్గాల నుంచి అందరి సంక్షేమానికి పని చేసిన నాడే అటువంటి ప్రభుత్వానికి ప్రజల మన్నన దక్కుతుంది. సీఎం జగన్ అందరి సంక్షేమం చూస్తున్నారని.. అందరి బాగోగులు ఆయనకు కావాలని పేదలు, బడుగు–బలహీనవర్గాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంటికొచ్చి మరీ పింఛన్ అందజేసే ప్రభుత్వం ఏదైనా ఉందీ అంటే అది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అని అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పదికాలాల పాటు జగన్‌బాబు చల్లగా ఉండాలని వారు దీవెనలందిస్తున్నారు.


కొత్తగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేస్తున్న రంథి గోపీకృష్ణ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

- తెల్లారక ముందే ఇంటికెళ్లి పింఛన్ల అందజేత
- తమ జీవితంలో ఇలాంటి సంక్షేమ ప్రభుత్వాన్ని చూడలేదంటున్న అవ్వాతాతలు
- పదికాలాల పాటు ఈ ప్రభుత్వమే ఉండాలని దీవెనలు

అల్లిపురం : ప్రతి నెల ఠంచన్‌గా ఒకటో తేదీ తెల్లవారు జామున ఇంటి తలుపుతట్టి అవ్వాతాత, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమే. గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు సక్రమంగా అందించకపోగా తీవ్ర అవస్థలకు గురి చేసేవారు. దానికి భిన్నంగా నేడు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తున్నారు. దీంతో అవ్వాతాతలు, వితంతువులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పలు సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల వద్దకే చేరుతున్నాయి. వార్డు వలంటీర్లను నియమించి ప్రజల బాగోగులు చూసుకోవాలని సీఎం జగన్ సూచించారు. ఏ పనీ చేసుకోలేని వృద్ధులకు పెద్ద కొడుకుగా మారి ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా డబ్బులు అందుతున్నాయని.. సీఎం జగన్ తమకు పెద్ద కొడుకులా నిలిచారని ఎంతో మంది లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అతడి రుణం తీర్చుకోలేమని అంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఈనెల పలువురికి పింఛన్లు మంజూరు అయ్యాయి.

కొత్త పింఛన్‌తో ఆసరా..



కొత్త పింఛన్‌తో నాకు ఆసరా దొరికింది. నేను ఎక్కడికీ వెళ్లకుండా వలంటీరే మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. ఇప్పుడు నాకు వితంతు పింఛన్ మంజూరు చేశారు. చాలా ఆనందంగా ఉంది.

– కొణతాల నూకాలమ్మ, అల్లిపురం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు..



మాలాంటి వారికి అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. వితంతువులు, వృద్ధులకు ఇంటి వద్దకి వచ్చి పింఛన్ అందజేయటం సంతోషంగా ఉంది.

– చిప్పాద రామలక్ష్మి, బంగారుమెట్ట

ఒంటరి మహిళకు అండ..



ఒంటరి మహిళను అయిన నేను ఆర్థికంగా ఇబ్బంది పడేదానిని. గతంలో పింఛన్ కోసం ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మంజూరు చేయలేదు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మా ఇంటికి వచ్చి మరీ దరఖాస్తు చేయించి పింఛన్ మంజూరు చేశారు. చాలా ఆనందంగా ఉంది.

– కేవీ కిరణ్‌మాలిని, అల్లిపురం

నిద్రలేపి మరీ పింఛన్ ఇస్తున్నారు..



తెల్లారేటప్పటికి వలంటీర్ బాబు వచ్చి నిద్రలేపి మరీ పింఛన్ ఇస్తున్నాడు. ప్రతి నెలా నా మనుమడు జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ పంపిస్తున్నాడు. ఎక్కడికీ తిరక్కుండా, నాలాంటి వారికి శ్రమ లేకుండా చేస్తున్నాడు. పది కాలాల పాటు ఆ బాబు చల్లగా ఉండాలి.

– పూసర్ల బుచ్చి కాసులు, అల్లిపురం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా..



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారు. గత నాలుగేళ్లుగా ప్రజల అవసరాలు తెలుసుకుని ఎప్పటికప్పుడు వాటిని తీరుస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంట్లో ఒక సభ్యుడిగా మారిపోయారు.

– రంథి గోపీకృష్ణ,
33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

మంచినీటి పైపులైన్ల తనిఖీ


వాటర్ సప్లై అధికారులను అడిగి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 38వ వార్డు సోల్జర్‌పేటలో తాగునీరు కలుషితమై వాసన వస్తుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కి ఫిర్యాదు అందింది. వెంటనే ఎమ్మెల్యే స్పందించి జీవీఎంసీ వాటర్ సప్లై విభాగం అధికారి డీఈ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణతో మాట్లాడి మంచినీటి పైపు లైన్లు తనిఖీ చేయించారు. పరిసర ప్రాంతాల ప్రజలను పిలిచి సమస్య అడిగి తెలుసుకున్నారు. ఆ నీటిలో ఎటువంటి డ్రైనేజీ వాటర్ కలుషితం కావడం లేదని స్వయంగా జీవీఎంసీ సిబ్బందే ఆ మంచినీటిని తాగి స్థానికులకు చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డుల్లో ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారానికి తానే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు ఆదిల్, టీకే ప్రసాద్, చిన్నికృష్ణ, రాజారెడ్డి, ఫిర్యాదీదారు మంజు, జీవీఎంసీ వాటర్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో ఇబ్బంది


జోన్-5 సౌకర్యం బిల్ కౌంటర్ వద్ద అడ్డంగా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

కంచరపాలెం : జ్ఞానాపురం జోన్–5 జోనల్ కార్యాలయం సౌకర్యం కేంద్రం అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. ఇంటి పన్ను, నీటి పన్ను ఇతర సేవల కోసం జ్ఞానాపురం సౌకర్యానికి వెళ్తే అన్నీ ఇబ్బందులే ఎదురవుతున్నాయి. పార్కింగ్ స్థలంలో నగదు చెల్లింపుల కౌంటర్ ఉండటంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఇబ్బందులు తలెత్తితే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సౌకర్యం వద్ద జోన్–5 సిబ్బందే అడ్డదిడ్డంగా తమ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వాహనాల పొగ గొట్టాలు వినియోగదారులకు తగిలి కాళ్లు కాలే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలు సౌకర్యం కేంద్రానికి దూరంగా పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బీఎం మణి, జ్ఞానాపురం

18వ రోజుకి చేరిన శ్రావణలక్ష్మి పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం 18వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం



ర్యాలీగా వస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార : నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగ కల్పనకు ఐక్యంగా ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వ ర్యంలో సరస్వతీ పార్కు నుంచి డాబాగార్డెన్స్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా లలితా జ్యూయలరీ వరకు నిరుద్యోగ యువతీ, యువకులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు యూఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గునాయుడు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలకు ఎసరపెడున్నారని మండిపడ్డారు. సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలున్నప్పటికీ పర్మినెంట్ ఉద్యోగాలు తీయకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, డైలీ వేజ్ వంటి ఉద్యోగాలు ఇచ్చి ప్రైవేట్ వ్యక్తులకు లాభాలు చేకూరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు యువత ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.సంతోష్, ఐద్వా రాష్ట్ర నాయకులు బి.పద్మ, డాక్టర్ జి.ప్రియాంక, సీఐటీయూ జిల్లా కార్యదర్శి యు.రాజు, ఎల్.జి. నాయుడు, గణేష్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు


లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. చాతుర్మాస్య దీక్షలో ఉన్న కుర్తాళ, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జులై 3 నుంచి సెప్టెంబర్ 29 వరకు చాతుర్మాస్య దీక్షలు చేపట్టడంతో స్వామీజీ లలితా పీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు తమ సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు మంత్రోపదేశం తీసుకున్నారు. మధ్యాహ్నం పీఠంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. లలితా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఏయూ అభివృద్ధి విధానం హర్షణీయం


వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సాంకేతికంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో చదువుకున్న 1984–86 బ్యాచ్ పీజీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ విద్యార్థులు విభాగాన్ని సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ క్యాంపస్‌లో జరుగుతున్న నూతన ప్రాజెక్టులు, కార్యక్రమాలను తాము ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాలు, స్నేహితుల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తుకు అవసరమైన నూతన సాంకేతికతలను చేరువ చేసి నేటి తరం విద్యార్థులకు అందిస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించాలని వీసీ పూర్వ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యర్రబెల్లికి సేవాబంధు పురస్కారం


సేవాబంధు పురస్కారంతో యర్రబెల్లిని సత్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్ : విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, విశాఖ ఫిట్‌నెస్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రబెల్లి ప్రభాకర్‌ను సేవాబంధు పురస్కారంతో ప్రశంస దీపిక కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సత్కరించింది. ఆదివారం నగరంలో ఓ హోటల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యర్రబెల్లిని పలువురు ప్రముఖుల సత్కరించారు. యర్రబెల్లి విశాఖ దక్షిణ నియోజకవర్గం హాకర్స్ యూనియన్ ప్రెసిడెంట్‌గా, నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు యర్రబెల్లిని అభినందించారు.

వైద్యులకు సత్కారం


వైద్యుల్ని సత్కరిస్తున్న జైభీమ్ సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న గ్రామీణ వైద్యుడు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యురాలు నాగమణి, సత్యను జైభీమ్ సంస్థ సత్కరించింది. పేదలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమ్యారెడ్డి, డాక్టర్ భవాని, డాక్టర్ శ్వేతా, సూర్యప్రసాద్, ఎస్. పద్మ, జై భీమ్ కన్వీనర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం


ఉమాగాంధీని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.ఉమా గాంధీని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తరపున గిడుగు అవార్డుకు ఎంపికై సత్కారం పొందిన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఎ.హైమావతి, విశ్రాంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుప్పిలి లక్ష్మీవరప్రసాద్‌ను మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం దుర్గాదేవి, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత. పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగుభేరి పుస్తకావిష్కరణ నేడు

మద్దిలపాలెం: ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో తెలుగు భేరి పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుందని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరు కానున్నారని పేర్కొన్నారు. తెలుగు పద్యాలు, గేయాల సంకలనంగా రూపొందించిన ఈ పుస్తకాన్ని తెలుగుభాషా పరిరక్షణ దిశగా ఓ అడుగు అని పేర్కొన్నారు. భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు. చిత్రంలో తైనాల, వంశీకృష్ణ యాదవ్, డాక్టర్ రెహ్మాన్, సీతంరాజు సుధాకర్

మహారాణిపేట : పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. ఆదివారం ఒక హోటల్లో జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ జాన్‌వెస్లీ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఎ. రెహ్మాన్, తైనాల విజయకుమార్, సీతంరాజు సుధాకర్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, బీసీ సెల్ నాయకులు, సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు పార్టీ నాయకులను సత్కరించారు.

ఘనంగా వాసవీ వీక్


సమావేశంలో పాల్గొన్న వాసవీ క్లబ్ అల్లిపురం ప్రతినిధులు

అల్లిపురం : వాసవీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా జయంతి సందర్భంగా వాసవీ క్లబ్ అల్లిపురం ఆధ్వర్యంలో వాసవీ వీక్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ అల్లిపురం శాఖ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ మేరకు అల్లిపురం సౌత్ జైలురోడ్డులో గల క్లబ్ ఆవరణలో ఆదివారం సభ్యులు సమావేశమయ్యారు. వారం రోజుల కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు 1వ తేదీన దాతలకు సన్మానం, రెండవ రోజు మాతృవందనం కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను పూజించడం, మూడవరోజు వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు అల్పాహారం అందించడం జరిగాయన్నారు. ఇక నాల్గవ రోజు విద్యార్థులకు మోటివేషన్ కోచింగ్, ఐదవ రోజు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లకు సత్కారం, ఆరవ రోజు పాత్రికేయ దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు సత్కారం, 7వ రోజు ప్రత్యేక తరగతి విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేపట్టేందుకు తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్లబ్ కార్యదర్శి బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా, రీజనల్ చైర్‌పర్సన్ వరిగల పండు, ప్రొగ్రాం చైర్మన్ వంకాయల విక్రమ్, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, బోర్డు సభ్యులు పెన్నం రత్నాజీరావు, డీవీఆర్ గుప్తా, ఎం.భద్రం, కేఆర్ నాగేశ్వరరావు, వంకాయల రవి తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక నిత్య హితోక్తులు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సాహితీవేత్తలు

సీతంపేట: తెలుగు భాషకు గౌరవం, ఆదరణ పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కళావేదిక వ్యవస్థాపకుడు, డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన 'సామాజిక నిత్య హితోక్తులు 2' అనే పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగు భాషకు, సాహిత్యానికి ఆదరణ, గౌరవం తగ్గిందని, ప్రభుత్వాలకే కాదు యువతలోనూ లోపించిందన్నారు. తెలుగు భాష దండగ అనే భావన పిల్లల్లోనే కాదు, తల్లిదండ్రుల్లోనూ ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. ఇంగ్లిష్ నేర్చుకుంటే ఉపయోగం అన్న భావన ప్రస్తుత తరంలో బాగా పెరిగిందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన సూచనగా ప్రతి ఒక్కరూ పరిగణించాలన్నారు. ఇలాగే కొనసాగితే వందేళ్లలో తెలుగు భాష పూర్తిగా ప్రమాదంలో పడుతుందన్నారు. తెలుగు భాషను కాపాడుదాం అన్న ఆలోచనతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాహితీవేత్తలు, సంఘాలు పెద్ద ఎత్తున పూనుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష పరిరక్షణకు తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తొలి ప్రతిని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు ఎ.హెచ్.ఎస్.వెంకటరావుకు అందజేశారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ఆచార్య కోలవెన్ను విఠల్ మూర్తి, ఆచార్య జె.అప్పారావు, మల్లాది సోమేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు కుంకుమ పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కంచరపాలెం : జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, మంగళగౌరీ వ్రతాలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక దర్శనాలు కూడా ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, జోజిబాబు తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు

బీచ్ రోడ్డు: డాక్టర్ బుల్లయ్య కాలేజీలో చదువుకున్న 1985–90 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి అధ్యాపకులు వెంకటరావు, పీవీఎస్ రామారావు, డి.రాజారావు, ఎస్.సత్యనారాయణ, స్వర్ణలత తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్. చిరంజీవి, డి.శ్రీనివాసరావు, డి.శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లలితానగర్‌లో బీటీ రోడ్ల నిర్మాణం


లలితానగర్‌లో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్‌లో రహదారులు మెరిసిపోతున్నాయి. నిన్న మొన్నటి వరకు రాళ్లు తేలిన రోడ్లు.. నేడు కొత్తగా కనిపిస్తున్నాయి. లలితానగర్‌లోని లలితా పీఠం రోడ్డుతో పాటు పలు అనుబంధ రహదారుల్లో కొత్తగా బీటీ రోడ్లు నిర్మించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా వార్డులోని పలు ప్రాంతాల్లో రహదారులు, సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. శిథిలమైన రోడ్లు, డ్రెయిన్ల స్థానంలో కొత్తవి నిర్మించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.